క్లుప్తంగా

నాయీ బ్రాహ్మణులకు అండగా ఉంటాం

ఎమ్మెల్యేలు కన్నబాబు, ద్వారంపూడి



ఎమ్మెల్యే ద్వారంపూడిని సత్కరిస్తున్న నాయీబ్రాహ్మణ ప్రతినిధులు

కాకినాడ: నాయీ బ్రాహ్మణులకు అన్ని విధాలా అండగా ఉంటామని కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు హామీ ఇచ్చారు. స్థానిక అన్నదాన సమాజంలో మంగళవారం నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధనలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. నాయీ బ్రాహ్మణులకు ఎటువంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. నాయీ బ్రాహ్మణులంతా ఐక్యతతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, సంఘ నగరాధ్యక్షుడు వేమనపల్లి వీరబాబు, జిల్లా అధ్యక్షుడు కె.సత్యనారాయణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి టి.వాసు, కోశాధికారి పి.బాబు, పి.చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాశక్తి యాగం

22వ రోజుకు చేరిన కుంకుమార్చనలు



మహిళలకు హారతి చూపుతున్న పరిపూర్ణానంద స్వామి

కాకినాడ రూరల్: రమణయ్యపేట శ్రీపీఠంలో మహాశక్తి యాగం ఘనంగా నిర్వహిస్తున్నారు. తుఫాన్ ప్రభావంతో వానలు పడుతున్నా భక్తులు మాత్రం భారీగా తరలివచ్చి లలితా కుంకుమార్చనల్లో పాల్గొంటున్నారు. పరిపూర్ణానంద స్వామిజీ పర్యవేక్షణలో మహాశక్తి యాగం మంగళవారం 22వ రోజుకు చేరింది. ఉదయం నక్షత్ర పూజలు, తిథి పూజలు జరిగాయి. అనంతరం కుంకుమార్చనల వేదికపై హైదరాబాద్‌కు చెందిన హరిణి బృందం సంగీత కచేరితో భక్తిగీతాలు ఆలపించారు. తుఫాన్ కారణంగా దూర ప్రాంతాల నుంచి వచ్చేవారి కోసం కాస్త ఆలస్యంగా కుంకుమార్చనలను నిర్వహించారు. సాయంత్రం దీపోత్సవాన్ని బహిరంగ ప్రదేశంలో కాకుండా, మహాశక్తి యాగం వేదిక ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. అనంతరం బగళాముఖి హోమం నిర్వహించారు.

17న బీసీల ఆత్మీయ వన భోజన మహోత్సవం



వన భోజన మహోత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘాల నాయకులు

కాకినాడ సిటీ: కాకినాడ జిల్లాలో బీసీ కులాల ఆత్మీయ వనభోజన మహోత్సవం-2023 కాకినాడ మెక్లరిన్ గ్రౌండ్‌లో ఈ నెల 17న ఉదయం 9 నుంచి జరుగుతుందని బీసీ కులాల ప్రతినిధులు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథిగృహంలో వన భోజన మహోత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. బీసీ కులాల ప్రముఖులు మాట్లాడుతూ బీసీల్లో ఏ, బీ, సీ, డీ కేటగిరీలుగా ఉన్నా, అందరినీ బీసీగానే పరిగణించాలనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు చొల్లంగి వేణుగోపాల్, పెనుపోతు తాతారావు, పప్పు దుర్గాప్రసాద్, కుండల సాయికుమార్, వనపర్తి బద్రి, గుబ్బల తులసీకుమార్, సుందరపల్లి వీవీ గోపాలకృష్ణ, మెంటారావు, అనపర్తి ఆంజనేయులు, కొక్కిరిగడ్డ గంగరాజు, నులుకుర్తి వెంకటేశ్వరరావు, వమ్మి బాలాజీ, అద్దంకి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

కల్కి అవతారంలో సీతారామస్వామి



కల్కి అవతారంలో ఉన్న సీతారామస్వామి

బోట్‌క్లబ్: రజిత చిన్న దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి కల్కి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారికి ఆలయ ప్రధానార్చకుడు భావవరపు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ నాగనరసింహారావు



కరప ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిలిచిన వర్షపు నీరు



వాకాడ వద్ద లేఅవుట్‌లో బరకాలతో కప్పిన ధాన్యం రాశులు



తిమ్మాపురంలో నేలనంటిన చేనును పరిశీలిస్తున్న అధికారులు

నిండాముంచిన తుపాను

- ముంపుబారిన పల్లపు ప్రాంతాలు
- కొన్నిచోట్ల నేలనంటిన పంట

కరప: మిచాంగ్ తుపాను కారణంగా సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కురిసిన వర్షానికి మండలంలోని అనేక పల్లపు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. కరప, నడకుదురు, వలసపాకల, వేములవాడ, అరట్లకట్ట, గురజనాపల్లి, గొర్రిపూడి, పాతర్లగడ్డ తదితర గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. అధిక వర్షానికి ఎంపీడీఓ, ఎంఈఓ కార్యాలయాల వద్ద నీరు నిలిచిపోయింది.

నానుతున్న వరి పనలు

సార్వాలో ముదరగా ఊడ్చిన ప్రాంతాల్లో కోతలు పూర్తవ్వగా, లేతగా నాటిన పొలాల్లో కోతలు జరుగుతున్నాయి. తుపాను కారణంగా చేతికందిన పంట నీటి పాలైందని రైతులు ఆవేదన చెందుతున్నారు. రెండు రోజులుగా వీచిన ఈదురు గాలులకు పంటలు నేలనంటాయి. కోసిన చేలు కొంత మంది కుప్పలు వేసుకోగా, కొన్నిచోట్ల పనలపైనే ఉంది. వర్షానికి మళ్లల్లో నీరు నిలబడిపోయి పంట దెబ్బతింటోందని రైతులు అంటున్నారు. కుప్పనూర్చిన గ్రామాల్లో ధాన్యంరాశులు తడిసిపోకుండా గడ్డితోను, పైన బరకాలతోను కప్పారు. రంగుమారిన, మొలక వచ్చిన ధాన్యాన్ని ఆంక్షలు పెట్టకుండా మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కోత కోయకుండా నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని వారు కోరుతున్నారు. లేఅవుట్లలో వేసిన ధాన్యం రాశులు తడిసిపోయాలయని, తేమ శాతం పేరుతో రైసుమిల్లుల్లో కోతలు విధించకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



యండమూరులో నీటిలో నానుతున్న వరిపనలు

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లేతగా ఊడ్చిన పొలాల్లో నీరు నిలబడి పోయింది. రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే జరిగిన నష్టాన్ని కొంత వరకు తగ్గించుకోవచ్చని కరప ఎంఏఓ ఏవీ రాజేష్ సూచించారు. కరప, వలసపాకల, పాతర్లగడ్డ, వేములవాడ, వాకాడ, యండమూరు తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి రైతులకు సూచనలు చేశారు. పొలాల్లోని ముంపు నీరు పోయేలా కాలువలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పనమీద ఉన్న చేలల్లో నీటిని తీసివేసి పన తిరగవేయాలని, గింజరంగు మారకుండా ఉండేందుకు, మొలక రాకుండా ఉండేందుకు ఐదు శాతం ఉప్పుద్రావణం (లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పు కలపాలి) పిచికారీ చేయాలని ఎంఏఓ రైతులకు సూచించారు.

నేలకొరిగిన వరిచేలను పరిశీలించిన అధికారులు

కాకినాడ రూరల్: మండలంలోని పలు గ్రామాలలో ఖరీఫ్ వరిచేలు తుపాను ప్రభావంతో నేలకొరిగాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల వరి చేలు ముంపునకు గురికావడంతో.. రైతులు నీరు తరలించే చర్యలు చేపట్టి పంటను రక్షించుకుంటున్నారు. మరోవైపు ధాన్యపు రాశులు వేసుకుని ఉన్న రైతుల కోసం ఆర్బీకేల్లో గోనెసంచులు అందుబాటులో ఉంచారు. కాకినాడ కొవ్వూరు, తిమ్మాపురం తదితర గ్రామాల్లో మంగళవారం ఏడీఏ పద్మశ్రీ, వ్యవసాయాధికారి సత్యనారాయణ పొలాలను పరిశీలించారు.

ఇబ్బందులు తలెత్తకుండా చూడండి

కాకినాడ: మిచాంగ్ తుపాను నేపథ్యంలో వర్ష ప్రభావిత ప్రాంతాల ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు అధికారులు ఆదేశించారు. మంగళవారం ఆయన ఎస్ఎఫ్‌సీఎల్, రేచర్లపేట రైల్వేడ్రైన్, కల్పన సెంటర్, సినిమా రోడ్‌లోని నగరపాలక సంస్థ కార్యాలయం, మెయిన్ రోడ్, సినిమా రోడ్, సంజయ్‌నగర్, దుమ్ములపేట ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. అవుట్‌లెట్లు, కల్వర్టుల్లో నీరు స్తంభించకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. నీరు నిలిచిపోతే మోటార్ల ద్వారా తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పునరావస కేంద్రాల్లో ఏర్పాట్లపై సూచనలు చేశారు.



జలమయమైన తూరంగి ఈశ్వర్ కాలనీలో రోడ్డు

పారిశుధ్య సిబ్బందిని నిరంతరం అందుబాటులో **ఉంచాలని ప్రజారో**గ్య విభాగ అధికారులను ఆదే**శించారు. వర్షాల నే**పథ్యంలో వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో కాల్ సెంటర్ ఏర్పాటు చేశామని కమిషనర్ వెల్లడించారు. ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ 1800 4255 990కు కాల్ చేయవచ్చన్నారు. కమిషనర్ వెంట నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి డాక్టర్ పృథ్వీచరణ్ ఉన్నారు.

పల్లపు ప్రాంతాలు జలమయం

కాకినాడ సిటీ: తుపాను కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాకినాడ రూరల్ మండలం తూరంగి, కొవ్వూరు, కాకినాడ సిటీ పరిధిలోని జగన్నాథపురం, ఏటిమొగ, ముత్తానగర్, మహాలక్ష్మి నగర్ తదితర పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. అలాగే ఎంఎస్ఎన్ చార్టీస్, ఆంధ్రా పాలిటెక్నిక్‌లు వర్షపు నీటితో నిండిపోయాయి. తూరంగిలోని ఈశ్వర్‌కాలనీ, గోపీకృష్ణా కాలనీ, డ్రైవర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అధికార యంత్రాంగం గ్రామాల్లో పర్యటించి సహాయక చర్యలు చేపట్టారు. పగడాలపేటలో ముందు జాగ్రత్తగా పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

ప్రతి రైతునూ ఆదుకుంటాం

ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కరప: తుపాను కారణంగా నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. ఒడ్డున పడేవరకూ అండగా ఉంటామని రైతులకు భరోసా ఇచ్చారు. యండమూరు, వాకాడ, వలసపాకల తదితర గ్రామాల్లో స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే కన్నబాబు పర్యటించారు. తుఫాన్‌తో నెలకొన్న పరిస్థితులను, నేలనంటిన పంటలను, తడిసిన పనలను, ధాన్యంరాశులను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. రైతులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి, ధాన్యం కొనుగోలులో నిబంధనలు సడలించి, ఆఫ్‌లైన్‌లో కొనేలా చర్యలు తీసుకున్నారన్నారు. తేమ శాతం 17 నుంచి 18 వరకు కటింగ్ లేకుండా మద్దతు ధరకు కొంటారన్నారు. రైతులు ఏ మిల్లుకైనా తీసుకెళ్లవచ్చన్నారు. మురుగుకాలువలో గుర్రపుడెక్క తొలగించేందుకు మందు సక్రమంగా పిచికారీ చేయలేదని, పిల్ల, ఊట కాలువల్లో పూడిక తీయించాలని రైతులు కోరారు. పంటలు నేలనంటి, కోసిన చేలు మునిగిపోయి నష్టపోయామని, పరిహారం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే కన్నబాబు స్పందించి పౌర సరఫరాల శాఖ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. జరిగిన నష్టం వివరించి, రైసు మిల్లులో ధాన్యం తీసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మురుగు కాలువలో గుర్రపు డెక్క తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధిహామీ పథకంలో పిల్ల కాలువలు తవ్వేలా చర్యలు తీసుకుంటామన్నారు.



యండమూరులో ఎమ్మెల్యే కన్నబాబుకు తడిసిన పనలను చూపిస్తున్న రైతులు

నష్ట పరిహారానికి చర్యలు

ఏయే గ్రామాల్లో ఎంతమేర నష్టం వాటిల్లిందో సర్వే చేయించి, నష్ట పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కన్నబాబు రైతులకు హామీ ఇచ్చారు. ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలుకు అన్నిరకాల చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. యండమూరు మురుగు కాలువ వద్ద ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేసేందుకు తగిన నిధులు మంజూరు చేయిస్తామన్నారు. ఆఫ్‌లైన్‌లో అరట్లకట్ట, గొడ్డటిపాలెం గ్రామాల్లో 248.6 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు ఎంఏఓ రాజేష్ తెలిపారు. జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, వైస్ ఎంపీపీ బొమ్మిడి వీర్రాఘవులు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, సర్పంచ్ వాసంశెట్టి రామారావు, పార్టీ నాయకులు పెంకే సత్తిబాబు, బండే తాతాజీ, మారెళ్ల వెంకటరమణ, రెడ్డి శ్రీనివాస్, కొత్త రవి, కమిడి శంకర్, సాదే లోహిదాస్, మద్దూరి భాస్కర్, నక్కా వీరభద్రరావు, మీసాల చక్రం, మేడిశెట్టి సత్తిబాబు భోగిరెడ్డి సూర్యనారాయణ, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, కార్యదర్శి పి.వీరభద్రరావు, వీఆర్వో ఎం.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారులతో సమీక్ష

కాకినాడ రూరల్: తుపాను ప్రభావంతో వరిపంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వ పరంగా నష్ట పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు మాజీ వ్యవసాయ శాఖ మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో తుపాను ప్రభావంపై వ్యవసాయ శాఖ అధికారులతో మంగళవారం సాయంత్రం రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. పనలపై ఉన్న, నేల కొరిగిన చేలు, ధాన్యపు రాశులు తదితర వాటిపై చర్చించారు. పంట నీట మునిగి నష్టపోయిన రైతులకు ప్రభుత్వ పరిహారం అందించేందుకు క్షేత్ర స్థాయిలో పారదర్శకంగా గుర్తింపు చేపట్టాలని కోరారు, కాకినాడ రూరల్‌లో సుమారు 800, కరప మండలంలో సుమారు 600 ఎకరాల పంట నష్టం వాటిల్లవచ్చని ప్రాథమికంగా గుర్తించినట్టు ఏడీఏ పద్మశ్రీ వివరించారు.

అవినీతికి చిరునామా కొండబాబే..

- స్థాయిని మరిచి పంతం కామెంట్స్
- మండిపడ్డ ఎమ్మెల్యే ద్వారంపూడి



కాకినాడ: టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబే అవినీతికి చిరునామా అని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి వ్యాఖ్యానించారు. ఎలాంటి వ్యాపారాలు లేని కొండబాబు ఏ మార్గంలో కోట్లు కూడబెట్టారో చెప్పాలని నిలదీశారు. అలాంటి అల్లాఉద్దీన్ అద్భుత దీపం ఏమిటో తమకు కూడా చెప్పాలని కోరారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ద్వారంపూడి మాట్లాడుతూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్‌పై తాను చేసిన విమర్శలకు కట్టుబడి ఉన్నానన్నారు. వాటికి సమాధానం చెప్పకుండా నోటికొచ్చినట్టు కొండబాబు మాట్లాడుతున్నారని విమర్శించారు. లోకేష్ పాదయాత్రకు విశేష ప్రజాదరణ ఉందంటూ కొండబాబు చేసిన వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. అరకొర జనాన్ని చూసి మురిసిపోతున్న కొండబాబుకు అసలు లోకేష్ వద్ద ఏ మాత్రం సీన్ లేదన్నారు. కనీసం కాకినాడ టిక్కెట్‌ను కూడా పవన్‌కల్యాణ్‌తో నిర్ధారించుకుంటే మినహా ప్రకటించుకోలేని దుస్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. చిన్న ఇంట్లో ఉండే కొండబాబు, కోట్లు ఖర్చు చేసే ఐదంతస్తుల భవనాన్ని కట్టి కోట్ల రూపాయలు ఎలా సంపాదించారో ప్రజలందరికీ తెలుసన్నారు. తన మనుమడి పుట్టిన రోజు వేడుక కోసం కుటుంబం సహా ఊటీ వెళ్లానని, దానిని కూడా రాజకీయం చేసి అవాకులు, చవాకులు పేలుతున్నారంటూ కొండబాబుపై మండిపడ్డారు.

పంతం.. అవాకులు చవాకులు పేలొద్దు

తనపైనా, తండ్రి, సోదరునిపైనా అవాకులు, చవాకులు పేలితే తీవ్రంగా పరిగణిస్తానని ఎమ్మెల్యే ద్వారంపూడి జనసేన పీఏసీ సభ్యుడు పంతం నానాజీని హెచ్చరించారు. అతని విమర్శలకు సరైన గుణపాఠం చెప్పగలనన్నారు. రైతుల బాధలపై చలించి ద్వారంపూడి భాస్కరరెడ్డిపై విమర్శలు చేశానని పంతం నానాజీ చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే ద్వారంపూడి తీవ్రంగా స్పందించారు. రైతులకు సంబంధించిన జిల్లా కేంద్ర బ్యాంకులో పంతం నానాజీ కుటుంబం 12 కార్లు తీసుకుని, అమ్మి మోసం చేసిన మాట వాస్తవం కాదా అని నిలదీశారు. హేచరీల కోసం రుణాలు తీసుకుని బ్యాంకుకు ఎగ్గొట్టేందుకు ప్రయత్నించారంటూ ఆరోపించారు. వ్యాపార భాగస్వాములను కూడా దగా చేసిన నైజం పంతం నానాజీదని, ఆ తగాదాలు కూడా తానే తీర్చానన్నారు. సుదీర్ఘ అనుభవంతో తన తండ్రి పాతికేళ్లుగా రైసుమిల్లు పరిశ్రమకు చేసిన సేవకు గుర్తింపుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఇచ్చారన్నారు. తన సోదరుడు వీరభద్రారెడ్డికి ఏకగ్రీవంగా రాష్ట్రంలోని మిల్లర్లంతా అధ్యక్ష పదవి కట్టబెట్టారన్నారు. వాస్తవాలను పక్కన పెట్టి, పైరవీలు, దళారీ పనులతో పంతం నానాజీ రోజులు వెళ్లదీస్తున్నారని చెప్పారు.

పారదర్శక ఓటర్ల జాబితా లక్ష్యం

- ఈఆర్వో నాగనరసింహారావు
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

కాకినాడ: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పారదర్శక, దోష రహిత ఓటర్ల జాబితాను రూపొందించడమే లక్ష్యమని కాకినాడ సిటీ నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ-2024లో భాగంగా వచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కారంపై మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఫారం 6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తుల ప్రగతిని ఈఆర్వో నాగనరసింహారావు వారికి వివరించారు. వచ్చిన ప్రతి ఒక్క దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఓటరు ప్రత్యేక శిబిరంలో వచ్చిన దరఖాస్తులను కూడా ఎప్పటికప్పుడు వేగంగా పరిష్కరించేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించడంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కొత్త ఓటర్ల నమోదు, నాన్ ట్రేస్డ్ ఓటర్లకు సంబంధించి రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపించిన నోటీసుల వివరాలు, మార్పులు చేర్పులకు సంబంధించిన సమాచారాన్ని ఆయన నాయకులకు వివరించారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు(వైఎస్సార్ సీపీ), తుమ్మల రమేష్ (టీడీపీ), అప్పారావు (బీఎస్పీ), డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఏఈఆర్వోలు మురళీకృష్ణ, జాన్‌బాబు, హరిదాసు, నాగశాస్త్రులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న ఈఆర్వో నాగనరసింహారావు

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

బోట్‌క్లబ్: ధాన్యం కొనుగోళ్లలో రైతులను తేమ పేరుతో ఇబ్బందులకు గురిచేయవద్దని బీజేపీ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి యార్లగడ్డ రామ్‌కుమార్ అధికారులను కోరారు. కాకినాడలో మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం తుపాను కారణంగా రైతుల ధాన్యం రాశులు రోడ్లపైనే ఉన్నాయన్నారు. ప్రభుత్వం తేమ శాతం చూడొద్దని చెప్పినా, కొందరు మిల్లర్లు తేమ శాతం బూచిగా చూపి బస్తాకు రూ.100 నుంచి రూ.150 కోత విధిస్తున్నారన్నారు. అలాంటి మిల్లర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి రంభాల వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు ప్రోత్సాహకాలు

కాకినాడ: ప్రయాణికులకు ఆర్టీసీ గిఫ్ట్‌స్కీమ్‌లో విజేతలను సోమవారం డ్రా పద్ధతిలో ఎంపిక చేశారు. కాకినాడ డిపో నుంచి కోటిపల్లి, కోటనందూరు రూట్లలో ప్రయాణించిన ప్రయాణికులను డ్రా తీయగా, అప్పారావు(కోటనందూరు), వెంకట్(మాధవపట్నం) బహుమతులు పొందారు. కోటిపల్లి రూట్‌లో పి.శ్రీనివాసరావు(ద్రాక్షారామ), ఎ.కామేష్(గొల్లప్రోలు) బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు అభిరుచి స్వీట్స్ అధినేత మందపల్లి శ్రీనివాసరావు సమకూర్చిన బహుమతులను జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు డిపో ఆవరణలో మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, డిప్యూటీ సూపరింటెండెంట్ ఏవీఎస్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ, పునరావాస కేంద్రం తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను తనిఖీ చేస్తున్న నరసింహనాయక్

కాకినాడ సిటీ: తూరంగి పీహెచ్‌సీ, మహాలక్ష్మినగర్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను కాకినాడ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి నరసింహనాయక్ మంగళవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో వైద్యులను, పునరావాస కేంద్రానికి వచ్చే వారి వివరాలను సిబ్బందిని, అక్కడ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రజలకు ఏ విధమైన అనారోగ్య సమస్యలు వచ్చినా తక్షణం వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆస్పత్రిలో గర్భిణులకు అందుతున్న వైద్యం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చిన్నపిల్లలకు శ్వాసకోశ వ్యాధుల నివారణ చర్యలు, ఏఎన్ఎంలు యాప్‌లు పెండింగ్ లేకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యులు మౌనిక, వసుంధరాదేవి ఉన్నారు.

రేషన్ షాపులపై దాడులు

సామర్లకోట: పట్టణంలోని రేషన్ షాపులపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం దాడులు జరిపారు. స్థానిక ఉప్పువారివీధి, కుమ్మర వీధుల్లో ఉన్న రేషన్ షాపుల్లో సరకులను అక్రమంగా తరలిస్తున్నారనే ఫిర్యాదుల మేరకు ఈ దాడులు నిర్వహించారు. ఆయా షాపుల్లో సరకుల నిల్వలో తేడాలు ఉండటంతో, రెండు షాపులను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. ఈ మేరకు వారిపై 6ఏ కేసు నమోదు చేయాలని పౌర సరఫరాల శాఖ అధికారులకు సిఫార్సు చేశారు.

సముద్ర రక్షణలో నౌకాదళం కీలకపాత్ర

కాకినాడ రూరల్: సముద్ర రక్షణలో నౌకాదళం కీలకపాత్ర పోషిస్తుందని, దేశ సముద్ర ప్రయోజనాల రక్షణకు నిరంతరం బాధ్యతగా వ్యవహరిస్తుందని నౌకాదళ విశ్రాంత అధికారి చావలి రామచంద్రప్రసాద్ తెలిపారు. భారత నౌకాదళ వారోత్సవాలను పురస్కరించుకుని రమణయ్యపేటలో ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం రామచంద్రప్రసాద్‌ను సన్మానించారు. ప్రసాద్ మాట్లాడుతూ భారత నౌకాదళం సాధించిన విజయాలు, దేశ రక్షణలో పాత్రను గుర్తు చేసుకోవడానికి ఏటా డిసెంబర్ ఒకటి నుంచి ఏడు వరకు నౌకాదళ వారోత్సవాలు జరుపుతారని వివరించారు.

స్వచ్ఛంద సేవకులకు సన్మానం

కాకినాడ రూరల్: అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినోత్సవం సందర్భంగా రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛంద సేవకులైన హోప్ ఫర్ ఛేంజ్ వ్యవస్థాపకుడు నాగేంద్ర, మీకోసం స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు పల్లి నాగేశ్వరరావు, చీకట్ల శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ రత్న ప్రసాద్ మాట్లాడుతూ మానవ మనుగడలో తమ సమయాన్ని, నైపుణ్యాన్ని స్వచ్ఛందంగా అందించడమే సేవ అన్నారు. సేవ అనేది అన్ని మతాల్లో ఇమిడి ఉంటుందని విశ్రాంత ఉపాధ్యాయుడు నిమ్మకాయల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.



రామచంద్ర ప్రసాద్‌ను సన్మానిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు